సాక్షి నిర్మల్

గురువారం • 26 • అక్టోబర్ • 2023



ఉపాధ్యాయులే ఎమ్మెల్యేలుగా..

బోథ్ నుంచి 38 ఏళ్లుగా ఉపాధ్యాయులు ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో 14 మంది ఎన్నిక కాగా, ఇందులో నలుగురు టీచర్‌గా పని చేసినవారే.. 10లో▸



భైంసాలో భగీరథ కష్టాలు

భైంసాలో మిషన్ భగీరథ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పూర్తి స్థాయిలో తాగునీరందక పట్టణ ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 / 18.0

ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం, రాత్రి చలి ప్రభావం పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

నిర్మల్ రూరల్: దసరా సెలవులు ముగిసినందున గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో గురువారం నుంచి అల్పాహార పథకాన్ని అమలు చేయాలని ఆదేశించారు.

బీజేపీలో పలువురి చేరిక



కండువా వేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బీజేపీలో చేరగా జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, అనిల్, జమాల్, వెంకట్‌రెడ్డి, నర్సారెడ్డి, గంగన్న, హరీశ్‌రెడ్డి, గంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాగరాజు, ముత్యం, నర్సయ్య, వెంకటి, సాయిరెడ్డి, సచిన్, రమేశ్, వినకర్, ఉదయ్, హైమద్, రాములు, ధర్మన్న, సాయి, మునీందర్, యాదవ్, శ్యామ్, శ్రీధర్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచులు



కండువా వేస్తున్న శ్రీహరిరావు

మామడ: మండలంలోని కమల్‌కోట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు గనిమెల నగేశ్, లాల్‌సింగ్, సారంగపూర్ మండల నాయకుడు నవీన్ బీజేపీకి రాజీనామా చేసి బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. అంతకు ముందు మండల కేంద్రంలో శ్రీహరిరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విలాస్‌రావ్, రాజు, నర్సయ్య, రమణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు కార్డులివ్వాలి'

నిర్మల్: యూట్యూబ్ ద్వారా ప్రజలకు సమాచారాన్ని అందిస్తున్న న్యూస్‌చానల్స్‌ను గుర్తించాలని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారిక గుర్తింపు కార్డులివ్వాలని యూట్యూబ్ న్యూస్ చానల్స్ అసోసియేషన్ కోరింది. ఈమేరకు బుధవారం కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్‌ను కలిసిన 67మంది వివిధ చానెళ్ల ప్రతినిధులు వినతిపత్రం అందించారు.

'తప్పుడు ప్రచారం తగదు'

నిర్మల్: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి విశ్వహిందూ పరిషత్ చివాట్లు పెట్టిందంటూ తప్పుడు ప్రచారం చేయడాన్ని వీహెచ్‌పీ ఖండించింది. బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. వీహెచ్‌పీ ఓ ధార్మిక సంస్థ అని, రాజకీయాలతో సంబంధం ఉండదని జిల్లా కార్యదర్శి జాదవ్ విఠల్ పేర్కొన్నారు. నిర్మల్ బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డికి చివాట్లు పెట్టినట్లు చేస్తున్న దుష్ప్రచారాన్ని వెంటనే ఆపివేయాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

'పార్టీ గెలుపునకు కృషి చేయండి'



రామారావుపటేల్‌తో కౌన్సిలర్లు, నాయకులు

భైంసాటౌన్: బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి పవార్ రామారావు పటేల్ కోరారు. దసరా సందర్భంగా మంగళవారం రాత్రి ఆయన తన నివాసంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, కౌన్సిలర్లు గౌతం పింగ్లే, వడ్నం రాజేశ్వర్, నాయకులు గాలి రవి, దిలీప్, రావుల పోశెట్టి, సాహెబ్‌రావు తదితరులు ఆయనను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముధోల్‌లో కాషాయజెండా ఎగురవేసేలా పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

టికెట్ ఎవరి 'చేతి'కో..!



జంగ్ తెలంగాణ

- ఖానాపూర్‌పై పట్టువీడని బొజ్జు
- టికెట్ ఆశించే చేరిన రేఖానాయక్
- ముధోల్ కోసం నలుగురి యత్నం
- ప్రధాన పోటీ ఇద్దరు నేతల మధ్యే..
- నేడో.. రేపో రెండో జాబితా వెల్లడి

నిర్మల్: జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను మూణ్నెళ్లముందే బీఆర్‌ఎస్ ప్రకటించగా, బీజేపీ తాజాగా వెల్లడించింది. ఇక కాంగ్రెస్ ఒక్క నిర్మల్ అభ్యర్థిని మాత్రమే ప్రకటించి ఆగిపోయింది. ఖానాపూర్, ముధోల్‌లో ఎవరు బరిలో ఉంటారనేదే తేల్చాల్సి ఉంది. ఇటీవల ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్, ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్ రాహుల్‌గాంధీ సమక్షంలో పార్టీలో చేరగా అంతా ఇక ఆ రెండు స్థానాలు వారికే అని భావించారు. కానీ.. కొన్నినెలలుగా ఆయా స్థానాల్లో టికెట్లు ఆశిస్తూ.. ప్రచారం చేసుకుంటున్న ఆశావహులు మాత్రం తమకే టికెట్ దక్కుతుందని బలంగా చెబుతున్నారు.

ఖానాపూర్‌లో ఇద్దరిదే పై'చేయి'..

ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఖానాపూర్‌లో కాంగ్రెస్‌కు ఈసారి భారీగానే ఆశావహుల తాకిడి ఉంది. పలువురు సీనియర్లతోపాటు జూనియర్ నేతలూ సీటు ఆశిస్తున్నారు. ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ జాన్సన్‌నాయక్‌ను, బీజేపీ రమేశ్‌రాథోడ్‌ను అభ్యర్థులుగా ప్రకటించాయి. వీరిద్దరూ లంబాడా సామాజిక వర్గానికి చెందినవారే. ఈక్రమంలో కాంగ్రెస్ నుంచి ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జుపటేల్ టికెట్ ఆశిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా బొజ్జుకు పేరుంది. ఇటీవల ఎమ్మెల్యే రేఖానాయక్ పార్టీలో చేరినప్పటికీ తనకే టికెట్ వస్తుందని ఆయన ధీమాగా చెబుతున్నారు. ఆసిఫాబాద్‌లో ఆమె భర్త శ్యాంనాయక్ కూడా టికెట్ ఆశిస్తుండటంతో అక్కడ ఆయనకు ఇచ్చి, ఇక్కడ రేఖానాయక్‌కు ఇవ్వకపోవచ్చనే వాదన కూడా ఉంది. మరోవైపు రానున్న ఎంపీ ఎన్నికల్లో రేఖానాయక్‌కు టికెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఏదేమైనా ఖానాపూర్ పార్టీ టికెట్ మాత్రం తనకే దక్కుతుందని వెడ్మ బొజ్జు స్పష్టంగా చెబుతున్నారు. అలాగే తామూ సీనియర్లమని, తమకే పార్టీ టికెట్ వస్తుందని ఉట్నూర్ జెడ్పీటీసీ సభ్యురాలు చారులత రాథోడ్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్రకార్యదర్శి భరత్‌చౌహాన్, ఏఐసీసీ రీసెర్చ్ కమిటీ కో–ఆర్డినేటర్ వినోద్‌నాయక్, పరిశ్రమల శాఖ రిటైర్డ్ మేనేజర్ రాంకిషన్‌నాయక్, పీఆర్పీ నుంచి గతంలో పోటీచేసిన గంగాపూర్‌కు చెందిన చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భక్షినాయక్, ఖానాపూర్‌కు చెందిన కౌన్సిలర్ కిశోర్‌నాయక్ కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. ఖానాపూర్ టికెట్ కోసం 15మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ప్రధానంగా బొజ్జు, రేఖానాయక్‌లో ఒకరికి టికెట్ రావొచ్చన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు భరత్‌చౌహాన్, చారులత, వినోద్‌నాయక్ పార్టీ అధిష్టానం స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు.

ముధోల్‌లో 'పటేల్'కు పోటీ

ఇటీవల రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ముధోల్ టికెట్ ఆశిస్తున్నారు. కానీ.. ఆయన కంటే ముందే కొన్ని నెలలుగా ఇక్కడ పార్టీలో చేరిన డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ సీరియస్‌గా సీటు కోసం ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం నుంచి తనకు అనుకూల నిర్ణయం వస్తుందన్న ఆశతో ఆయన ఉన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్లు ఆనంద్‌రావుపటేల్, విజయ్‌కుమార్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఎవరి వారే పార్టీ తమకే టికెట్ ఇస్తుందన్న ధీమాతో ఉన్నారు. తాజాగా పార్టీలో చేరిన నారాయణరావు పటేల్‌కు గత ఎన్నికల్లో తక్కువ ఓట్లు వచ్చాయన్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో నారాయణరావుపటేల్ ముందుగా కాంగ్రెస్‌లోని ఆశావహులతో టికెట్ కోసం పోటీ పడాల్సి వస్తోంది.

ఆ ఇద్దరు ఒక్కటయ్యారు..

ముధోల్ నియోజకవర్గంలో గడ్డెన్న, ఆ తర్వాత నారాయణరావుపటేల్ కుటుంబాలదే హవా సాగింది. నారాయణరావుపటేల్ రాజకీయంగా రాణించడానికి, గెలవడానికి సహకరించిన సోదరులు రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్ ఇద్దరూ ఈసారి ఆయనకు దూరమయ్యారు. గత ఎన్నికల్లో మోహన్‌రావుపటేల్ సహకరించినా ఈసారి బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తూ ఆయన ప్రచారం చేసుకున్నారు. అదే బీజేపీలో చేరి, సీటు ఆశించిన రామారావుపటేల్‌కు పార్టీ టికెటిచ్చింది. తనకు అభ్యర్థిత్వం ఖరారైన వెంటనే ఆయన మోహన్‌రావుపటేల్‌ను కలిసి తనకు సహకరించాలని కోరారు. ఈమేరకు మోహన్‌రావు పటేల్ కూడా సుముఖత వ్యక్తం చేస్తూ రామారావుపటేల్‌కు మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. దీంతో ఈసారి ఎన్నికల వేళ నారాయణరావుపటేల్‌కు ఇద్దరు సోదరులు దూరమయ్యారు.

అప్పట్లో ఎన్నికల ఖర్చు పది వేలే..!

- అప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు
- మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్‌నాయక్



ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే గోవింద్‌నాయక్

దండేపల్లి: ''ఇప్పటి ఎన్నికల తీరు చూస్తుంటే పిచ్చెక్కిపోతుంది.. ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు కోట్లు గుమ్మరిస్తుండ్రు, దీంతో ఓటర్లు కూడా అలానే తయారయ్యారు. ఎవరు ఎంత ఇస్తుండ్రు అని చూస్తుండ్రు తప్పా అభిమానం అనేది పూర్తిగా కనుమరుగైందనే చెప్పొచ్చు. ఎన్నికల ప్రచారానికి లెక్క లేనంతగా ఖర్చు పెడుతుండ్రు. మా అప్పటి ఎన్నికల తీరుకు ఇప్పటి ఎన్నికల తీరుకు చాలా మార్పు వచ్చింది. 1985 ఎన్నికల్లో నేను రూ.10వేలు మాత్రమే ఖర్చు చేశాను..'' అని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్‌నాయక్ అన్నారు. అప్పటి, ఇప్పటి ఎన్నికల తీరుపై గోవింద్‌నాయక్ 'సాక్షి'తో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆయన మాటల్లోనే..

అభిమానంతో ఓటేసేవారు..

నేను మొట్టమొదటిసారి 1977లో ఖానాపూర్ నుంచి జనతా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశాను. అప్పుడు ఎన్నికలపై ఎవరికీ పెద్దగా అవగాహన ఉండేది కాదు. ఆ సమయంలో నేను ఓడిపోయాను. రెండోసారి 1985లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందాను. అప్పుడు నేను ఎన్నికల కోసం ఖర్చు చేసింది రూ.10వేలు మాత్రమే. ఇదీ ఓటర్లకు పంచేందుకో, మరో దేనికో కాదు. గ్రామాల్లో తిరిగేందుకు ప్రయాణ ఖర్చులు, గోడలపై రాతలకు మాత్రమే. నేనే ద్విచక్ర వాహనంతో ఎక్కువగా పర్యటించేవాణ్ని. ఎందుకంటే గ్రామాలకు సరైన రోడ్డు మార్గాలు ఉండేవి కాదు. పెద్ద పెద్ద వాహనాలు లేవు. ఓటర్లు కూడా అభిమానంతో ఓటేసేవారు తప్పా నయా పైసా ఆశించేవారు కాదు.

1994లో రూ.లక్ష మాత్రమే..

రెండోసారి టీడీపీ నుంచి పోటీ చేశాను. అప్పుడు కూడా ఇప్పటితో పోల్చుకుంటే చాలా తక్కువే. కేవలం లక్ష రూపాయలు అయ్యింది. మేము కూడా జనం కోసం అలా పని చేసి ప్రజల్లో అభిమానాన్ని సంపాదించుకున్నాం. ప్రజలంతా కూడా మా పై ఉన్న అభిమానంతో మాకు ఓటేసి గెలిపించుకునేది. వారి కోసం మేము పనిచేసేది. నిత్యం ప్రజల మధ్య తిరిగేటోళ్లం. ఖానాపూర్ నియోజకవర్గం చిత్రవిచిత్రంగా ఉంటుంది. కొత్తగా ఏర్పడిన నాలుగు జిల్లాలకు విస్తరించింది. దీంతో ప్రచారం చేయడం అభ్యర్థులకు కష్టమే.

2004లో రూ.10లక్షలకు పెరిగింది..

నేను మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేశాను. మొదట 1985 పోటీ చేసిన సమయంలో ప్రచార ఖర్చు రూ.10వేలు అయితే రెండోసారి 1994లో రూ.లక్ష, ఇక మూడోసారి 2004లో మాత్రం రూ.10లక్షల వరకు పెట్టాను. అంతే తప్పా ఇప్పటిలా కోట్లు ఖర్చు పెట్టలేదు.

పోలింగ్ ఏజెంట్‌కు రూ.10 మాత్రమే..

ఎన్నికల రోజున పోలింగ్ సమయంలో ఏజెంట్‌గా వ్యవహరించే వారికి రూ.10 ఇచ్చేది. అది నాకు బాగా గుర్తుంది. నేను రాజకీయంగా ప్రజల ఆదరాభిమానాలు పొందాను. అదే నాకు చాలా సంతోషం. ఇప్పటికీ నియోజకవర్గ ప్రజలు నన్ను మరిచిపోరు. అభిమానంతో నన్ను గెలిపించుకున్నారు. నేను కూడా ప్రజలకు అదే తీరుగా పనిచేశాను. రాజకీయాల్లోకి అడుగు పెట్టిన తర్వాత కొందరు సంపాదించుకుంటారు. కానీ.. నేను అలాంటిదేమీ చేయలేదు. మా తాతలు, తండ్రుల నుంచి వచ్చిన కొన్ని ఆస్తులు అమ్మేశాను తప్పా.. కొనలేదు. వయస్సు పైబడడంతో ప్రస్తుతం స్వగ్రామం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్‌లో ఇంటి వద్ద ఉండి విశ్రాంతి తీసుకుంటున్నాను.

ప్రశాంతం.. నిమజ్జనోత్సవం



శోభాయాత్రలో భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



కోలాటమాడుతున్న మహిళలు

- భారీ పోలీస్ బందోబస్తు మధ్య కనులపండువగా శోభాయాత్ర
- ఆకట్టుకున్న భక్తుల నృత్యాలు

భైంసా/భైంసాటౌన్: భైంసాలో బుధవారం దుర్గామాత నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఉదయం భవానీచౌక్‌లో ముధోల్ ఎమ్మెల్యే జీ విఠల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్, ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు విలాస్ గాదేవార్, రామకృష్ణాగౌడ్ తదితరులు పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ శోభాయాత్ర బందోబస్తును పర్యవేక్షించారు. ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ శోభాయాత్ర మార్గాల్లో పర్యటిస్తూ యువతను ముందుకు నడిపించారు. నిమజ్జనం సందర్భంగా భైంసాలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు ఏఎస్పీలు, ముగ్గురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 27 మంది ఎస్సైలు, 400 మంది ప్రత్యేక పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. శోభాయాత్ర దృశ్యాలను సీసీ కెమెరాలతోపాటు డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తూ పరిస్థితి తెలుసుకున్నారు. శోభాయాత్ర మార్గంలో పారామిలిటరీ బలగాలను మోహరించారు. పంజేషచౌక్ నుంచి ఏఎస్పీ కార్యాలయంతోపాటు కిసాన్‌గల్లికి వెళ్లే మార్గాలను మూసివేశారు.

ఆకట్టుకున్న యువకుల నృత్యాలు



డీజే పాటపై స్టెప్పులిస్తున్న యువతులు

నిమజ్జనం సందర్భంగా యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భవానీచౌక్‌లోని దుర్గామాత మండపం ఎదుట డప్పుచప్పుళ్ల మధ్య పోతరాజులు చేసిన నృత్యాలు అలరించాయి. దుర్గామాత విగ్రహాలు కుభీర్ చౌరస్తాకు చేరుకోగానే వందలాదిగా యువకులు నృత్యాలు చేస్తూ కనిపించారు. కుభీర్ చౌరస్తా నుంచి పంజేషచౌక్ వరకు యువకుల నృత్యాలు కొనసాగాయి. కాషాయజెండాలతో 'జై భవానీ.. జై శివాజీ.. భారత్‌మాతాకీ జై' అంటూ నినాదాలు చేస్తూ కనిపించారు.

శోభాయాత్ర మార్గంలో పూజలు

శోభాయాత్ర మార్గాల్లో తరలివచ్చే దుర్గామాత విగ్రహాలకు పట్టణవాసులు పూజలు చేశారు. శోభాయాత్రలో రోడ్లన్నీ పసుపుమయమయ్యాయి. ఇంటి ముందుకు వచ్చిన దుర్గామాతలకు భక్తులు కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేసి మొక్కుకున్నారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌లో నిమజ్జనం

భైంసాలో నెలకొల్పిన దుర్గామాతలను గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌లో నిమజ్జనం చేశారు. మున్సిపల్ అధికారులు భారీ క్రేన్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఒక్కొక్కటిగా విగ్రహాలు గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌కు చేరుకోగానే నిమజ్జన ఘాట్‌లో నిమజ్జనం చేశారు. శోభాయాత్ర పొడవునా ట్రాన్స్‌కో అధికారులు అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాను నిలిపేశారు. శోభాయాత్ర కొనసాగే మార్గాల్లో ఉండే ప్రధాన వీధుల్లో సరఫరా నిలిపివేసి మిగతా ప్రాంతాలకు యథావిధిగా కొనసాగించారు. గణేశ్‌నగర్, భట్టిగల్లి, బ్రాహ్మణ్‌గల్లిలో ఉదయం నుంచి నిమజ్జనం ముగిసేవరకు విద్యుత్ సరఫరా నిలిచింది. పట్టణంలోని దుర్గామాత విగ్రహాలను ఈ వీధుల్లోంచే గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు తరలించారు. దీంతో విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో ఆ ప్రాంతాల్లో నిలిపివేశారు.

మహిళలు, యువతులు కోలాటం వేస్తూ కనిపించారు. పట్టణంలో రాత్రి సమయంలో ప్రత్యేక లైట్ల వెలుతురు, డీజే చప్పుళ్ల మధ్య శోభాయాత్ర కొనసాగింది. శోభాయాత్ర మార్గాల్లో పులిహోర, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



దుర్గామాతను నిమజ్జనం చేస్తున్న భక్తులు



బందోబస్తులో బీఎస్‌ఎఫ్ జవాన్లు



బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ, భైంసా ఏఎస్పీ

ఎలాంటి ఘటనైనా సమాచారమివ్వాలి

- పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి
- జిల్లా ఎన్నికలాధికారి ఆశిష్ సాంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: హెడ్‌క్వార్టర్స్‌ను నిర్వహిస్తూ ఎలాంటి ఘటన జరిగినా వెంటనే తెలుపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బుధవారం రిటర్నింగ్ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, నోడల్ అధికారులు, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి సమీకృత కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీరోజు పోలింగ్ కేంద్రాలు సందర్శించాలని తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తేవాలని పేర్కొన్నారు. అధికారి అనుమతి లేనిదే సెలవుపై వెళ్లరాదని, 24/7 ఏ క్షణంలోనైనా అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోడల్ అధికారుల టీం స్ట్రాంగ్‌గా ఉండాలని పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను ప్రతీరోజు పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, ర్యాంప్ ఏర్పాటు, టాయిలెట్స్ పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. మైనర్ రిపేర్స్ ఉంటే త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

'పిల్లర్ కుంగిన ఘటనపై విచారణ చేపట్టాలి'

నిర్మల్‌చైన్‌గేట్: కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకంలో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ 20వ పిల్లర్ కుంగుబాటుపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డ్యాం సేఫ్టీ అధికారుల నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్ట్ పూర్తయిన రెండేళ్లకు గోదావరికి వరదలు రాగా ఇదే బ్యారేజీ ఏడు పంపులు నీట మునిగాయని తెలిపారు. వాటి రిపేర్లు, నష్టం ఎవరు భరించాలన్న మీమాంస ముందుకువచ్చిందని పేర్కొన్నారు. ఆ ఘటన మరిచిపోక ముందే మూడో సంవత్సరం వరదలు తగ్గిన తర్వాత 18నుంచి 21వరకు గల బ్యారేజీ పిల్లర్లు అడుగున్నర లోతు కుంగిపోయాయని తెలిపారు. వీటితో పాటు వివిధ ప్రాజెక్ట్‌ల నిర్మాణంలో లోపాలు ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. పగుళ్లు, లీకేజీలేర్పడుతూ.. పెచ్చులూడుతున్నాయని తెలిపారు. నాలుగేళ్లుగా 8ఏళ్ల లోపు నిర్మించిన ప్రాజెక్ట్‌ల్లో నాణ్యత లోపాలు వెలుగుజూస్తుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. మొత్తం ప్రాజెక్ట్ పూర్తి కాకముందే జరిగిన భారీ నష్టంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు తెలియజేయడంతో పాటు నష్టానికి బాధ్యులెవరో ప్రకటించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలు



ఖానాపూర్: గల్ఫ్ తెలంగాణ ఫోరం, స్పార్క్ మీడియా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దుబాయ్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్ నాయకులు పవన్‌సాయి, రాజేశ్వర్, రాజమల్లు, వెంకటేశ్, వికాస్, సురేశ్ ఉన్నారు.

లడూ @ రూ.లక్ష

మామడ: పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయంలో దసరా సందర్భంగా మంగళవారం సాయంత్రం లడ్డూకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ కండక్టర్ కటకం సుదర్శన్ రూ.లక్షా 300కు దక్కించుకున్నాడు. గతేడాది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా రూ.91వేలు పలకడం గమనార్హం.



వేలంలో దక్కించుకున్న లడ్డూతో సుదర్శన్

క్లుప్తంగా

రూ.1.40లక్షలు సీజ్


సీజ్ చేసిన నగదుతో పోలీసులు

జైనథ్: మండలంలోని పిప్పర్వాడ చెక్‌పోస్ట్ వద్ద పత్రాలు లేకుండా నగదును తరలిస్తున్న వ్యక్తి నుంచి రూ.1.40లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... మహారాష్ట్రలోని యవత్‌మాల్‌కు చెందిన ఆకాశ్ బద్రినాథ్ రాథోడ్ తన కారులో మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేయగా రూ.1.40లక్షలు లభించాయి. సదరు వ్యక్తి డబ్బులు తరలించేందుకు సరైన పత్రాలు సమర్పించకపోవడంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

రేకుల ఇంటి పైనుంచి జారిపడి వ్యక్తి మృతి


మారుతి(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన మారుతి(45) మంగళవారం రాత్రి ఇంటి రేకులను సరిచేసేందుకు పైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య సాగరాబాయితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి


ధనశ్రీ (ఫైల్)

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో జ్వరంతో చిన్నారి మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకొంది. వివరాల ప్రకారం... ఈదపు మహేందర్, లావణ్య దంపతుల కుమార్తె ధనశ్రీ(4) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. మంగళవారం జ్వరంతో పాటు ఫిట్స్ రావడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందింది. మహేందర్, లావణ్య దంపతులకు సంతానం లేకపోవడంతో తమ్ముడి కుమార్తెను దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. ఆ చిన్నారి సైతం అనారోగ్యంతో మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

మద్యం పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన ఇద్దరు వ్యక్తులపై వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో రాంనగర్‌కు చెందిన తలారి దేవిదాస్ తన షాప్‌లో 22 లీటర్ల మద్యం నిల్వ ఉంచాడు. దీని విలువ రూ.24,200 ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఎన్టీఆర్ చౌక్‌లో అంబేద్కర్‌నగర్‌కు చెందిన కాంబ్లే లఖన్ తన షాపులో 5 లీటర్ల మద్యం నిల్వ ఉంచగా దీని విలువ రూ.5,500 ఉంటుందని పేర్కొన్నారు. దాడులు జరిపిన వారిలో ఎస్సై ప్రదీప్, సిబ్బంది ఉన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) బైపాస్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని సీసీఎస్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీసీఎస్ సీఐ సాయినాథ్ మాట్లాడుతూ చాందా (టి) బైపాస్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడం ఆదిలాబాద్ రూరల్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు కలిసి దాడి నిర్వహించారు. అశోక్, ఫిరోజ్ ఖాన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.20,200, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఎస్సై ముజాహిద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులే ఎమ్మెల్యేలుగా...

- 14 మందిలో నలుగురు ఎమ్మెల్యేలూ ఉపాధ్యాయులే..
- బోథ్ నియోజకవర్గంలో కీలకపాత్ర

ఇచ్చోడ: బోథ్ ఎస్టీ అసెంబ్లీ రిజర్వుడ్ స్థానంలో 38ఏళ్ల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసిన వారే ఎమ్మెల్యేలుగా గెలుపొందుతూ వస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో 14మంది ఎమ్మెల్యేలు గెలుపొందగా దీంట్లో నలుగురు ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి ఎమ్మెల్యేలుగా గెలుపొందినవారే కావడం విశేషం.


గోడం రామారావు

- బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన గోడం రామారావు ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి మొదటిసారిగా 1985లో టీడీపీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. 1989లో మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందాడు.


రాథోడ్ బాపురావు

- నార్నూర్ మండల కేంద్రానికి చెందిన రాథోడ్ బాపురావు 1986లో ఆదిలాబాద్ మండలంలోని చింతగూడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియమితులయ్యాడు. 2009లో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014 టీఆర్ఎస్ నుంచి అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందారు. 2018లో రెండోసారి టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్‌కి రాజీనామా చేశారు.


గోడం నగేశ్

- రామారావు తనయుడు గోడం నగేష్ 1986లో బజార్‌హత్నూర్ మండలంలోని విఠల్‌గూడలో గిరిజన పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు. 1994లో బోథ్ మండలంలోని పార్డీ ఆశ్రమ పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందాడు. ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో గిరిజన శాఖ మంత్రిగా పనిచేశాడు. 1999లో రెండోసారి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర జీసీసీ చైర్మన్‌గా పనిచేశాడు. 2009 టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించాడు. నాల్గోసారి 2004 టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యాడు. 2014 ఎన్నికలకు ముందు టీడీపీకి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేసి గెలుపొందాడు. 2019 పార్లమెంట్ ఎన్నికలలో టీఆర్ఎస్ నుంచి పార్లమెంట్‌కు పోటీ చేసి ఓటమి చెందాడు.


సోయం బాపూరావు

- బోథ్ మండలంలోని నాగుగూడ గ్రామానికి చెందిన సోయం బాపూరావు 1987లో మహాదుగూడలో గిరిజన శాఖ ఉపాధ్యాయుడిగా నియమితుడయ్యాడు. వివిధ పాఠశాల్లో విధులు నిర్వహిస్తూనే తుడుం దెబ్బలో ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేశాడు. 2004 ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి టీఆర్ఎస్ నుంచి బోథ్ ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందాడు. 2014లో టీడీపీ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యాడు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా పోటీ గెలుపొందాడు. ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్నాడు.



లింగాపూర్, మల్లెష్‌పెట్, వడ్డెరగూడ గ్రామాలకు సిరిచెల్మలోని పోలింగ్ కేంద్రం

ఓటు వేయాలంటే.. నడవాల్సిందే

- కిలో మీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాలు
- బోథ్ నియోజకవర్గంలో ఏళ్లుగా తప్పని తిప్పలు

ఇచ్చోడ: బోథ్ ఎస్టీ అసెంబ్లీ రిజర్వుడ్ స్థానంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లితే కానీ ఓటు హక్కును వినియోగించుకోవడం సాధ్యం కాని పరిస్థితి. ఏళ్లుగా నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు ఓటర్లకు ఓటు తిప్పలు తప్పడం లేదు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మొగక ముందే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. సౌకర్యాలపై ఆరా తీస్తున్న అధికారులు కేంద్రాలు ఓటర్లకు అందుబాటులో ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని విస్మరించారు. ఓటర్లకు కేంద్రాలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2018 ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగిన ఓటర్లకు సమీపంలో కేంద్రాలను ఏర్పాటు చేయడంలో గతంలో ఎదుర్కొన్న సమస్యలే ఎదుర్కోవాల్సి వస్తుందని భావనలో ఓటర్లు ఉన్నారు.

- ఇచ్చోడ మండలంలోని గాయిదపెల్లి గ్రామస్తులు ఓటువేయడానికి కేశవపట్నం గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరం నడుచుకుంటూ రావాల్సిందే. గుండివాగు గ్రామస్తులు గుండికి 2కిలో మీటర్లు, లింగాపూర్, వడ్డెరగూడ, మల్లెష్‌పెట్ గ్రామస్తులు రెండు కిలో మీటర్లు సిరిచెల్మ పోలింగ్ కేంద్రానికి ఓటు హక్కు వినియోగించుకోవడానికి రావాలి.
- సిరికొండ మండలంలోని లఖంపూర్‌లో 150 మంది ఓటర్లు ఉన్నారు. వారంత ఓటు హక్కును వినియోగించుకోవడానికి 5కిలో మీటర్ల దూరంలోని కొండపూర్‌కు రావాలి. భీంపూర్ గ్రామస్తులు ఓటు వేయడానికి 5కిలో మీటర్ల దూరంలోని వాయిపెట్ గ్రామానికి రావాలి.
- తలమడుగు మండలంలోని మదనపూర్, నర్సపూర్, కొలంగూడ గ్రామస్తులు ఓటు వేయడానికి బరంపూర్‌లోని పోలింగ్ కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరం రావాల్సిన పరిస్థితి. సోనపూర్, దేవోజిగూడ, మల్కుపల్లి, పెండలవాడ గ్రామస్తులు రెండు కిలో మీటర్ల దూరంలోని లక్ష్మీపూర్‌కు ఓటు వేయడానికి రావాలి.
- నేరడిగొండ మండలంలో కుంటల(బి) గ్రామస్తులు ఓటు వేయడానికి వెంకటపూర్ గ్రామానికి నాలుగు కిలో మీటర్ల దూరం వెళ్లాలి. గాంధారి గ్రామస్తులకు కుప్టికి 3కిలో మీటర్లు, యాపల్‌గూడ గ్రామస్తులు రోల్ మామడ పోలింగ్ స్టేషన్‌కు నాలుగు కిలో మీటర్లు, గోవిందపూర్ గ్రామస్తులు, నాగమల్యాల్‌కు నాలుగు కిలో మీటర్లు దూరం వెళ్లి ఓటు హక్కును వినిగియెగించుకోవాలి.
- తాంసి మండలంలోని కర్ణవాడి, రాజలుగూడ, జల్‌కోరి, అట్నంగూడల ప్రజలు ఓటు వేయడానికి మూడు కిలో మీటర్ల దూరం నడవాల్సిందే.

నియోజకవర్గంలో ఓటర్లు

పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్‌బూత్‌లు
1,00,658	1,06,031	03	2,06,690	302

సరిహద్దు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

- డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

తాంసి: పెన్‌గంగ సరిహద్దు గ్రామాల శివారులో పులి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ సూచించారు. బుధవారం పిప్పల్‌కోటి గ్రామ శివారులో పులి దాడిచేసి ఆవుదూడను హతమార్చిన ప్రదేశాన్ని డీఎఫ్‌వో అటవీశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం పులి కదలికల కోసం ఏర్పాటు సీసీ కెమెరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన పులి సంచారం ఉన్నందున్న పంటచేలకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంటచేలకు డప్పుచప్పుళ్ల చేస్తూ వెళ్లాలన్నారు. పులి కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అటవీశాఖ, బేస్‌క్యాంపు సిబ్బందితో పాటు టాస్క్‌ఫోర్స్ బృందం పులి కదలికలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్‌డీవో గులాబ్, సెక్షన్ అధికారి హైమద్‌ఖాన్, బీట్ అధికారి సాయికుమార్ ఉన్నారు.

మూగ యువతిపై అత్యాచారం.. పదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: మూగ యువతిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం 10ఏళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, జరిమానా బుధవారం విధించింది. వివరాల ప్రకారం.. తానూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 20 ఏళ్ల మూగ యువతికి కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులకు సైగలతో తెలిపింది. 9 డిసెంబర్ 2016న తల్లిదండ్రులు భైంసా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో వైద్యులు పరీక్షించి యువతి 5నెలల గర్భవతని, బీపీ, రక్తహీనత ఉందని, నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రికి పంపించింది. అక్కడ పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. దీంతో గాంధీ ఆస్పత్రి వైద్యులు పరీక్షించి ఆపరేషన్ చేసి గర్భం తొలగించకపోతే ప్రాణహాని ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల అనుమతితో ఆపరేషన్ చేసి గర్భం తొలగించారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన తరువాత ఆ యువతిని తల్లిదండ్రులు ప్రశ్నించగా జరిగిన విషయం తెలిపింది. ఇంటి పక్కన గల ఎస్.కె అహ్మద్ అలియాస్ హైమద్‌ను చూపించింది. దీంతో కుటుంబీకులు తానూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం అప్పటి సీఐ రఘుపతికి అప్పగించాడు. సీఐ విచారణ చేసి నిందితుడిని అరెస్టు చేసి చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 12మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో అహ్మద్‌కు పైవిధంగా శిక్ష ఖరారైంది. రూ.3000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ తీర్పునిచ్చారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- జవహర్‌నగర్ వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి..
- వాఘాపూర్ యూ టర్న్ వద్ద స్కూటీపై రోడ్డు దాటుతుండగా మరో వ్యక్తి మృతి
- ఇద్దరిని ఢీకొన్న గుర్తు తెలియని వాహనాలు


మతిస్థిమితం లేని వ్యక్తి మృతదేహం

గుడిహత్నూర్: మండలంలో జాతీయ రహదారి 44పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇరువురు మృతి చెందారు. వీరిలో ఒకరు మతి స్థిమితం లేని వ్యక్తి కాగా, మరొకరు జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన బుదారపు గంగాధర్ (40) ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో మండల కేంద్రానికి సమీపంలోని జవహర్‌నగర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. ఏళ్లుగా గుడిహత్నూర్, ఆదిలాబాద్‌లో సంచరిస్తూ అందరికీ సుపరిచితుడయ్యాడు. అతడి పేరు ప్రవీణ్ అని తెలిపాడని మండల వాసులు తెలుపుతున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సంచరిస్తాడని.. అక్కడి ఛాయ్ హోటల్ వద్ద ఉంటాడని స్థానికులు తెలుపుతున్నారు.


గంగాధర్(ఫైల్)

రోడ్డు దాటుతుండగా..

జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన బుదారపు గంగాధర్ (40) పాలు, బ్రెడ్లు అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నాడు. మండలంలోని సీతాగోంది వద్ద జాతీయ రహదారి 44పై ఉన్న యూ టర్న్ వద్ద ఉదయం 8:30 గంటల ప్రాంతంలో వాఘాపూర్ వైపు వెళ్లే ప్రయత్నంలో ఆయన స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఇరు కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

108లో ప్రసవాలు


బిడ్డను అందిస్తున్న ఈఎంటీ కాశీనాథ్

సిరికొండ: మండలంలో 108 వాహనంలో ఒకేరోజు వేర్వేరుగా రెండు ప్రసవాలు జరిగాయి. మండలంలోని రిమ్మ గ్రామానికి చెందిన లాల్‌దేవి బుధవారం ఉదయం పురిటినొప్పుల రావడంతో ఇచ్చోడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో దుబార్‌పేట్ వద్ద మగ బిడ్డకు జన్మనిచ్చింది. అలాగే మండలంలోని వాయిపేట్ గ్రామానికి చెందిన మరో గర్భిణి లింగవ్వకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ 108లో ఇచ్చోడ తరలిస్తుండగా ధర్మసాగర్ గ్రామ చౌరస్తా వద్ద మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇద్దరు బాలింతలు, ఇద్దరు పిల్లలు క్షేమంగా ఇచ్చోడ ఆస్పత్రిలో ఉన్నట్లు ఈఎంటీ కాశీనాథ్, సురేష్, పైలెట్‌లు ప్రవీణ్, వినోద్ తెలిపారు.

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ హౌజింగ్ బోర్డులో ఈ నెల 15న జరిగిన దొంగతనం కేసులో ఒకరిని బుధవారం రిమాండ్‌కు తరలించిన్నట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. ఆయన వద్ద నుంచి 15 తులాల బంగారం, 82 తులాల వెండిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

కోడ్ ఏం చెబుతోంది..

- ప్రజల మధ్య విద్వేషాలు పెంచేలా వ్యవహరించొద్దు
- కులమతాల పేరుతో ఓట్లు అడుగొద్దు
- ఆలయాలు, మసీదులు, చర్చీల్లో ప్రచారానికి నో..
- ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలకు తావివ్వొద్దు
- ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల కమిషన్ ఎలక్షన్ నియమావళి విడుదల చేసింది. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే స్థానిక ఎన్నికల పరిశీలకులను కలిసి లేదా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. లేదా సీ-విజిల్ యాప్ ద్వారా ఉల్లంఘనులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసి నేరుగా ఎన్నికల సంఘానికి, ప్రత్యేక అధికారికి పంపించవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల సంకలనాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయం నుంచి విడుదల చేశారు. అందులోని ముఖ్యాంశాలు.



కోడ్ నియమావళి

- భిన్న, కుల, మత, భాష వర్గాల ప్రజల మధ్య విభేదాలు పెంపొందించే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు.
- ప్రత్యర్థి పార్టీలపై చేసే విమర్శలు కేవలం ఆ పార్టీ విధానాలు, కార్యక్రమాలు, గత చరిత్ర చేసిన పనులకు పరిమితమై ఉండాలి.
- వ్యక్తిగత విమర్శలు చేయకూడదు. ధ్రువీకరణ జరుగని ఆరోపణలు, వక్రీకరణల ఆధారంగా విమర్శలు చేయరాదు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వ్యక్తిగత విమర్శలు చేస్తూ పోస్ట్ చేయరాదు.
- ఎన్నికల చట్టాల్లో నేరపూరిత చర్యలుగా పేర్కొన్న కార్యకలాపాలకు దూరంగా ఉండాలి. ప్రధానంగా ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేయకూడదు.
- ఆధారాల్లేకుండా రూ.50 వేలకు మించి నగదు ఒకచోటి నుంచి మరో చోటికి తరలించకూడదు.
- ఓటరు స్థానంలో ఇతరులతో ఓటు వేయించడం, పోలింగ్ కేంద్రాలకు వందమీటర్ల దూరంలో ప్రచారం నిర్వహించడం, పోలింగ్‌కు 48 గంటల ముందు సభలు సమావేశాలు జరపడం, ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించడం వంటివి చేయరాదు.
- ప్రతీ పౌరుడు తన ఇంట్లో ప్రశాంతంగా బతికేందుకు తమహక్కును గౌరవించాలి. వ్యక్తుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా వారి ఇళ్లముందు నిరసనలు, ప్రదర్శనలు, ఆందోళనలు చేపట్టరాదు.
- యజమానుల అనుమతి లేకుండా వారి స్థలాలు, భవనాలు, ప్రహరీ గోడలకు జెండాలు, బ్యానర్లు కట్టడం, పోస్టర్లు అంటించడం, వాల్‌రైటింగ్ లాంటివి చేయరాదు.
- ఇతర పార్టీల సమావేశాలు, ఊరేగింపులకు తమ మద్దతుదారులు భంగం కలిగించకుండా చూసుకోవాలి. ఏదైనా ఒక పార్టీ కార్యకర్తలు వేరే పార్టీల సమావేశం జరుగుతున్న ప్రాంతం మీదుగా ఊరేగింపులు నిర్వహించకూడదు. ఒకపార్టీ అతికించిన పోస్టర్లను మరోపార్టీకి చెందిన కార్యకర్తలు తొలగించకూడదు.
- ఊరేగింపుల రూట్‌మ్యాప్‌ను నిర్వాహకులు ముందుగా స్థానిక పోలీసులకు తెలియజేయాలి. ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చూసుకోవాలి. ఇద్దరు లేదా అంతకు మించి అభ్యర్థులు లేదా పార్టీలు ఏకకాలంలో ఒకేరూట్‌లో ఊరేగింపు నిర్వహించే సమయంలో నిర్వాహకులు ముందుగా సంప్రదింపులు జరుపుకుని ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలి.
- ఊరేగింపులో తీసుకెళ్లే వస్తువుల విషయంలో పార్టీల అభ్యర్థులు నియంత్రణ పాటించాలి. అవి అసాంఘికశక్తుల చేతిలో దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతర పార్టీల నేతల దిష్టిబొమ్మలను ఊరేగించడం, బహిరంగంగా దహనం చేయడం వంటివి చేయరాదు.
- ఓటర్లు మినహా ఇతరులు పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించేందుకు అనుమతి ఉండదు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన పాస్ కలిగిన వారికి మినహాయింపు ఉంటుంది.
- శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతిపాదిత సభ సమయం, వేదికను ముందస్తుగా స్థానిక పోలీసులకు తెలియజేయాలి. సభ ఉన్న ప్రాంతంలో నిషేధాజ్ఞలు అమలులో ఉంటే వాటిని కచ్చితంగా పాటించాలి. అవసరమైతే ముందుగానే దరఖాస్తు చేసుకుని సడలింపులు పొందాలి. సభలో లౌడ్ స్పీకర్, ఇతర సదుపాయాలను వినియోగించడానికి ముందు సంబంధిత అధికారి నుంచి అనుమతి పొందాలి.
- అభ్యర్థుల స్పీచ్‌లు ఓటు వేసేలా ఉండకూడదు.
- స్వేచ్ఛగా ఓటు వేసేలా ఎన్నికల అధికారులు సహకరించాలి.
- ఓటర్లకు పంపిణీ చేసే చిట్టీలపై గుర్తులు, పార్టీల పేర్లు ఉండరాదు.
- పోలింగ్‌కు 48 గంటలకు ముందు నుంచి మద్యం పంపిణీ చేయరాదు.
- పోలింగ్ బూత్ వద్ద పార్టీలు, అభ్యర్థులు ఏర్పాటు చేసే క్యాంపుల వద్ద పోస్టర్లు, జెండాలు, గుర్తులు ఇతర ప్రచార సామగ్రి ప్రదర్శించరాదు. ఆహార పదార్థాలు పంపిణీ చేయరాదు.
- పోలింగ్ రోజు వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయి. పర్మిట్లు పొందిన వాహనాలకు స్టిక్కర్లు బాగా కానిపించే విధంగా అతికించాలి. ఎన్నికల నియమావళిని ఎవరు ఉల్లంఘించినా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసే హక్కు ప్రతీ భారతీయ పౌరునికి ఉంది.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన భీమనవేణి నారాయణ(65) ఉరేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్ తెలిపారు. నారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడలేదు. మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతాలకు అతీతంగా నవరాత్రి ఉత్సవాలు


సన్మానించిన గ్రామస్తులు

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో కులమతాలకు అతీతంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకుంటున్నారు. బుధవారం నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామానికి చెందిన మైనార్టీలు దుర్గామాత మండపం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయంగా వారే సహపంక్తి భోజనంలో కూర్చున్న భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సర్పంచ్ రాథోడ్ మధుకర్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ ఒక్కరు కలిసిమెలిసి ఉన్నప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎలాంటి కులమత బేధాలకు తావులేకుండా నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు ఉన్నారు.